విద్యుత్‌ సమస్యలు లేకుండా పరిష్కరిస్తాం



ఘట్‌కేసర్‌లో.. విద్యుత్‌ మరమ్మతులు చేయిస్తున్న చైర్‌ పర్సన్‌ పావనీజంగయ్య

ఘట్‌కేసర్‌: మున్సిపాలిటీలో విద్యుత్‌ సమస్యలు లేకుండా పరిష్కరిస్తామని మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ పావనీజంగయ్య అన్నారు. మున్సిపాలిటీలో శుక్రవారం ఆమె పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రధాన రహదారిపై చెడిపోయిన ఐమాక్స్‌ లైట్లు, ఇతర దీపాలకు మరమ్మతులు చేయించాలన్న స్థానికులు విన్నపం మేరకు.. పాత లైట్ల స్థానంలో క్రేన్‌ సాయంతో నూతన లైట్లను బిగింపజేశారు. అనంతరం చైర్‌ పర్సన్‌ మాట్లాడుతూ.. గ్రామంలో నిరంతరాయంగా విద్యుత్‌ సరఫరా అయ్యేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌ మల్లేష్‌, నాయకులు సిరాజ్‌, ఇతర నాయకులు పాల్గొన్నారు.

డివిజన్‌ అభివృద్ధికి కృషి చేస్తాం : డిప్యూటీ మేయర్‌



డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్‌ రెడ్డిశెట్టి శ్రీనివాస్‌

జవహర్‌నగర్‌: జవహర్‌నగర్‌ కార్పొరేషన్‌ 8వ డివిజన్‌ పరిధిలోని పాపయ్యనగర్‌ కాలనీలో శుక్రవారం భూగర్భ డ్రైనేజీ పనులను డిప్యూటీ మేయర్‌ రెడ్డిశెట్టి శ్రీనివాస్‌ ప్రారంభించారు. కాలనీవాసుల సొంత నిధులతో పాటు డిప్యూటీ మేయర్‌ సహకారంతో రూ.5 లక్షల యూడిసి నిధులతో పైప్‌లైన్‌ పనులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌ పరిధిలోని ప్రతికాలనీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో భారతి, రమేష్‌, కుమార్‌, రాజయ్య, సిద్దు, కృష్ణ, మల్లేష్‌ తదితరులు పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతు పనులు



మరమ్మతు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్‌ చైర్మన్‌ చంద్రారెడ్డి తదితరులు

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి- ఘట్‌కేసర్‌ వెళ్లే దారిలో రోడ్డు గుంతలు కావడంతో తాత్కాలిక మరమ్మతు పనులు చేపట్టడం జరుగుతుందని మున్సిపల్‌ చైర్మన్‌ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపల్‌ సిబ్బంది ఆధ్వర్యంలో చేపట్టిన రాంపల్లి-ఘట్‌కేసర్‌ రహదారి తాత్కాలిక మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్‌ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. కౌన్సిలర్‌ దివ్యదయాకర్‌రావు, మున్సిపల్‌ సిబ్బంది రాంరెడ్డి, ప్రశాంత్‌ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం



బినితా దేవి

మేడ్చల్‌రూరల్‌: డ్యూటీకి వెళ్తున్నానని ఇంటి నుంచి వెళ్లిన వివాహిత అదృశ్యమైన ఘటన మేడ్చల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ అశోక్‌ తెలిపిన వివరాల ప్రకారం.. నేపాల్‌కు చెందిన బినితా దేవి(28) భర్త చంద్ర బహదూర్‌తో కలిసి మేడ్చల్‌లో నివాసం ఉంటూ కేఎంపీ బిస్కెట్‌ కంపెనీలో కార్మికురాలిగా పనిచేస్తుంది. ఈ నెల 26న ఉదయం 7.30 గంటల సమయంలో కంపెనీకి వెళ్తున్నానని ఇంటి నుంచి వెళ్లిన బినితాదేవి సాయంత్రం తిరిగి ఇంటికి రాలేదు. దీంతో భర్త పోలీసులను ఆశ్రయించగా ఈ మేరకు మిస్సింగ్‌ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగులకు క్రికెట్‌ పోటీలు

దుండిగల్‌: దుండిగల్‌లోని ఎంఎల్‌ఆర్‌ఐటీ కళాశాలలో శుక్రవారం దివ్యాంగులకు ఐసీసీఎల్‌ ఐఎఫ్‌ ఎంఎల్‌ఆర్‌ఐటీ హెచ్‌ఏపీ క్రికెట్‌ పోటీలు నిర్వహించారు. విజేత, రన్నరప్‌గా నిలిచిన జట్ల సభ్యులకు కళాశాల చైర్మన్‌ మర్రి లక్ష్మణ్‌రెడ్డి ట్రోఫీ, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ వైకల్యం దేనికీ అడ్డుకాదని, పట్టుదల, కృషి ఉంటే ఏదైనా సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో సెయింట్‌ మార్టిన్స్‌ కళాశాల డైరెక్టర్లు చంద్రశేఖర్‌, సంతోష్‌, ఎంఎల్‌ఆర్‌ఐటీ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ శ్రీనివాస్‌, ప్రవీణ్‌కుమార్‌, రామ్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంతో చెలగాటం..

ఆకర్షణీయమైన ప్యాకింగ్‌, రుచికరమైన వాసనలతో హోటళ్లు.. రెస్టారెంట్ల ఆహారం

- పాటించని శుభ్రతతో ఆహార విక్రయశాలలు
- మాంసం క్రయవిక్రయాల్లోనూ అపరిశుభ్రత
- నాణ్యమైన ఆహారపదార్థాలు అందించటంలోనూ విఫలం
- పట్టించుకోని పుర, జీపీ యంత్రాంగం



సాక్షి,సిటీబ్యూరో: ఆకర్షణీయమైన ప్యాకింగ్‌, ఘుమఘుమలాడే వంటకాల వాసనలు, నోరూరించే ఆహార పదార్థాలు.. బయట హోటళ్లు, తోపుడుబండ్లలో కనిపిస్తుంటాయి. భోజన ప్రియులను ఆకట్టుకునే ప్రయత్నం బాగున్నా.. అందులో వినియోగించే నాసిరకం సరుకులు, హానికరమైన రంగులతో ముప్పు పొంచి ఉంది. నగర శివారు మేడ్చల్‌-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని 29 పురపాలక సంఘాలు, పలు పంచాయతీల్లోని చాలా హోటళ్లు, తినుబండారాల తయారీదారులు నిబంధనలు పాటించకుండా ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. ఆహార భద్రత టాస్క్‌ ఫోర్స్‌ బృందం ఇటీవల నగరంలో పలు హోటళ్లు, ఆహార పదార్థాల తయారీ కేంద్రాలను పరిశీలించగా ఇవన్నీ తేటతెల్లం అయ్యాయి.

నిబంధనలు గాలికి..

ఆహార వ్యాపారాలు ఊపందుకున్నాయి. ఇబ్బడిముబ్బడిగా హోటళ్లు, బిర్యానీ పాయింట్లు, రెస్టారెంట్లు, టిఫిన్‌ సెంటర్లు, బేకరీలు, తినుబండారాల తయారీ కేంద్రాలు వెలిశాయి. ఆహార పదార్థాల తయారీదారులు, విక్రేతలు ఫుడ్‌ సేఫ్టీ అండ్‌ స్టాండర్డ్‌ అథారిటీ ఆఫ్‌ ఇండియా (ఎఫ్‌ఎస్‌ఎస్‌ఎఐ) ప్రమాణాలను పాటిస్తూ, శుభ్రతతోపాటు తాజా సరుకులతో పదార్థాలను తయారు చేయాలి. చాలా కేంద్రాలు ఈ నిబంధనలకు గాలికి వదిలేస్తున్నారు. చెడిపోయిన, కుళ్లిపోయిన పదార్థాలు, బూజుపట్టిన కూరగాయలు, రోజులకొద్దీ ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన పదార్థాలు, కాలం చెల్లిన మసాలాలు, నిత్యావసరాలు, నాసిరకం పిండి, వాడిన నూనెలు మళ్లీ వాడటం, కృత్రిమ రంగులు వినియోగించడం వంటివి చేస్తున్నారు.

వినియోగదారుల చట్టం ప్రకారం..

వినియోగదారుల హక్కుల చట్టం ప్రకారం తినుబండారాల తయారీలో శుభ్రత, నాణ్యత విధిగా పాటించాల్సి ఉండగా... గ్రేటర్‌ శివారు జిల్లాలలో అమలుకు నోచుకోవడం లేదు. కూడళ్లు, చౌరస్తాలు, పార్కులు, రద్దీ ప్రదేశాలు, బస్‌స్టేషన్లు, రైల్వే స్టేషన్ల సమీప ప్రాంతాలతోపాటు హైదరాబాద్‌-వరంగల్‌ జాతీయ రహదారి, రాజీవ్‌ రహదారితోపాటు హైదరాబాద్‌-నిజామాబాద్‌ రహదారి ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపులా ఇబ్బడిముబ్బడిగా వెలుస్తున్న హోటళ్లు, పాస్ట్‌ఫుడ్‌ సెంటర్లు, టీ కొట్లలో పరిశుభ్రత చర్యలు కనిపించడం లేదు. రహదారులపై ఉండే హోటళ్లు నిత్యం రద్దీగా ఉంటున్నాయి. వాహనాల రాకపోకలతో దుమ్ము, ధూళి ఆహార పదార్థాలపై పడుతోంది. అయినప్పటికీ నిర్వాహకులు వాటిని విక్రయిస్తున్నారు. ముఖానికి మాస్కులు లేకుండా.. చేతులకు రక్షణ కవచాలు (తొడుగులు) వేసుకోకుండానే ఆహార పదార్థాలు, తినుబండారాలు తయారు చేస్తున్నారు. పాస్ట్‌ఫుడ్‌ కేంద్రాల్లో నూడుల్స్‌, ఫ్రైడ్‌ రైస్‌ తయారీ తర్వాత ప్లాస్టిక్‌ పాత్రల్లో, కవర్లలో వడ్డిస్తున్నారు. ఆహార పదార్థాలపై ఎలాంటి రక్షణ చర్యలు లేక ఈగలు, దోమలు వాలుతున్నాయి.

ఆకట్టుకునేందుకు రంగులు..

వినియోగదారులను ఆకట్టుకునేందుకు ఆహార పదార్థాల్లో ప్రమాదకరమైన రంగులను కూడా వాడుతున్నారు. హోటళ్లలో సమోసాలు, బజ్జీలు, గారెలకు, పాస్ట్‌ఫుడ్‌ కేంద్రాల్లో చికెన్‌ మంచూరియా, వెజ్‌ మంచూరియాల తయారీలో ఎరుపు రంగులు వాడుతున్నారు. మిగిలిన వాటిని ఫ్రిజ్‌లో ఉంచి మరుసటి రోజు విక్రయిస్తూ.. ప్రజల ప్రాణాలతో చెలగాలటం ఆడుకుంటున్నారు. హోటళ్లు, ఫాస్ట్‌ ఫుడ్‌ కేంద్రాల నుంచి వెలువడే పొగతో కూడా ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు, తోటి వ్యాపారులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. కూతవేటు దూరంలో పురపాలక సంఘాల కార్యాలయాలు ఉన్నా తనిఖీలు చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.



మాంసం విక్రయాల్లోనూ అంతే..

నగర శివారుల్లోని 29 పురపాలక సంఘాలతోపాటు జీహెచ్‌ఎంసీ పరిధిలోని పలు ప్రాంతాలలోని మాంసం క్రయవిక్రయ కేంద్రాల్లో కూడా పరిశుభ్రత పాటించటం లేదు. పురపాలక సంఘాలలోని మాంసం దుకాణాలపై హెల్త్‌ ఆఫీసర్ల పర్యవేక్షణ ఏమాత్రం లేకపోవటంతో ఫ్రిజ్‌ల్లో రెండు, మూడు రోజుల పాటు ఉంచిన మాంసాన్ని కూడా విక్రయిస్తున్నారు. దీంతో పట్టణ వాసులు రోగాల బారిన పడుతున్నారు.

పర్యవేక్షణ లోపం..

ఆహార భద్రతాధికారి పోస్టులు ఖాళీగా ఉండటంతోపాటు పురపాలక సంఘాల్లో కూడా హెల్త్‌ ఆఫీసర్లు లేకపోవటంతో హోటళ్లు, తినుబండారాల కేంద్రాలు, మాంసం క్రయవిక్రయ కేంద్రాలలోని పదార్థాలపై పర్యవేక్షణ కరువవుతోంది. దీంతో తినుబండారాల తయారీతోపాటు హోటళ్లు, మాంసం క్రయవిక్రయ కేంద్రాలను నడిపే వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.



విద్యార్థుల వంటకాలను పరిశీలిస్తున్న చెఫ్‌

లియో అకాడమీలో ఫుడ్‌ ఫెస్ట్‌

శామీర్‌పేట్‌: హోటల్‌ మేనేజ్‌మెంట్‌ రంగంలో అవకాశాలను అందిపుచ్చుకోవాలని తెలుగు అరోమా డైరెక్టర్‌ అండ్‌ చెఫ్‌ శ్రీకాంత్‌ అన్నారు. మేడ్చల్‌ జిల్లా తూంకుంటలోని లియో అకాడమీ ఆఫ్‌ హాస్పిటల్‌ అండ్‌ హోటల్‌ మేనేజ్‌మెంట్‌ కళాశాలలో రెండు రోజులుగా జరిగిన ఫుడ్‌ ఫెస్ట్‌ శుక్రవారంతో ముగిసింది. ఈ ఫుడ్‌ ఫెస్ట్‌లో తెలంగాణలోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్‌ కళాశాల, పాఠశాలల విద్యార్థులు పాల్గొని వివిధ రకాల వంటకాలను తయారు చేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖ చెఫ్‌లు విద్యార్థులు చేసిన వంటకాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులతో పాటు జ్ఞాపికలను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. హోటల్‌ మేనేజ్‌మెంట్‌ రంగంలో ప్రస్తుతం ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, విద్యార్థి దశ నుండే మెరుగైన భవిష్యత్తును ఎంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లియోనియా చెఫ్‌ రాజ్‌, కోస్తా క్రూజ్‌లైన్స్‌ చెఫ్‌ యోగేష్‌, అకాడమీ ప్రిన్సిపాల్‌, సిబ్బంది, పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



మొదటి బహుమతి సాధించిన విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

త్రిమూర్త్యాత్మక ఆలయంపై ప్రత్యేక గీతం

ఆవిష్కరించిన ప్రముఖ రచయిత బ్నిం తదితరులు



'పట్టాభిషేక దృశ్య వివరణ' పుస్తకావిష్కరణలో రచయిత బ్నిం, శ్రీదేవి తదితరులు

కీసర: దమ్మాయిగూడ మున్సిపల్‌ పరిధి ప్రజాసాయి గార్డెన్‌లోని త్రిమూర్త్యాత్మక రామాలయంలో శుక్రవారం ప్రముఖ రచయిత బ్నిం (బి.ఎన్‌ మూర్తి) ఆలయం ప్రాముఖ్యతను తెలుపుతూ రాసిన గీతాన్ని ఆవిష్కరించారు. అనంతరం సినీ దర్శకుడు, బాపు ప్రియ శిష్యుడు కడలి సురేష్‌, ఆలయం పైకప్పులో చిత్రీకరించిన శ్రీ రామపట్టాభిషేక సంపూర్ణ ప్రత్యేక చిత్రాలు, ఆలయ నిర్వహణ కార్యదర్శి వేదుల రామచంద్రరావు రచించిన 'తలచిన రామునే తలచెద నేను-పట్టాభిషేక దృశ్యం' వివరణాత్మక పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేవస్థాన నిర్వహణ కార్యదర్శి వేదుల రామచంద్రరావు మాట్లాడుతూ..మానవులు ప్రతి ఒక్కరూ దైవచింతన కలిగి ఉండాలన్నారు. ప్రముఖ రచయిత్రి ముళ్లపూడి శ్రీదేవి, రచయిత బ్నిం, ప్రముఖ చిత్రకారులు కడలి సురేష్‌, సినీ దర్శకులు ముళ్లపూడి, సినీఛాయా గ్రహణ నిపుణులు ముళ్లపూడి ప్రసాద్‌, దేవస్థాన సమితి ఉపాధ్యక్షులు సదానందం, ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, నిర్వహణ కార్యదర్శి రామచంద్రరావు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అటు శిథిలం.. ఇటు సౌకర్యాలు శూన్యం..!



శిథిలమైన తహసీల్దార్‌ కార్యాలయం

- పురాతన, వసతుల్లేని భవనాల్లో తహసీల్‌, జిల్లా రిజిస్ట్రేషన్‌ కార్యాలయాలు
- అటు ఉద్యోగులు, ఇటు వృద్ధులు, దివ్యాంగులకు తప్పని తిప్పలు
- శంకుస్థాపనకే తహసీల్దార్‌ భవనం పనులు

మేడ్చల్‌: మేడ్చల్‌ తహసీల్‌ కార్యాలయం శిథిలావస్థకు చేరుకున్నది. నిజాం కాలంలో అశ్వశాల కోసం నిర్మించిన భవనంలోనే మొదటినుంచి మండల రెవెన్యూ, సమితి కార్యాలయం, సబ్‌ రిజిస్ట్రార్‌, టెలికాం కార్యాలయాలు కొనసాగుతున్నాయి. అయితే భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో రెవెన్యూ విభాగం తప్ప మిగితావి ఎన్నో ఏళ్ల క్రితమే నూతన భవనాల్లోకి మారిపోయాయి. తహసీల్‌ కార్యాలయంలో అధికారులకు సరిపడా గదులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు రికార్డు గది పూర్తిగా శిథిలం కావడంతో వర్షం వస్తే చాలు రికార్డులకు భద్రత కరువవుతోంది. అయితే అధికారులు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపడుతున్నా..ఎప్పటికైనా ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉంది.

అడ్రస్‌ లేని శిలాఫలకం..

ఉమ్మడి రాష్ట్రంలో నాటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి మేడ్చల్‌ తహసీల్‌ కార్యాలయానికి పక్కా భవనం కోసం 2014లో శంకుస్థాపన చేసినా ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదు. అసలు స్థలం ఎక్కడ కేటాయించారో తెలియని పరిస్థితి నెలకొన్నది. పాత భవనం ప్రాంగణంలోనే సువిశాల స్థలం ఉందని అక్కడే నూతన భవనం నిర్మించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.



తహసీల్దార్‌ కార్యాలయ భవనం కోసం శంకుస్థాపన చేసిన అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి (ఫైల్‌)

రిజిస్ట్రేషన్‌ కార్యాలయంలోనూ ఇబ్బందులే..

మేడ్చల్‌ పట్టణంలో జాతీయ రహదారి పక్కనే రెండో ఫ్లోర్‌లో జిల్లా రిజిస్ట్రార్‌, మేడ్చల్‌ సంయుక్త సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయాలు ఏర్పాటు చేశారు. మెదటి అంతస్తులో డాక్యుమెంట్‌ రైటర్ల కార్యాలయాలు, మరో ఫ్లోర్‌లో మేడ్చల్‌ మండలం, జిల్లా కార్యాలయాలు ఏర్పాటు చేశారు. అయితే భవనానికి లిఫ్ట్‌ లేకపోవడంతో ఇనుప మెట్లు ఏర్పాటు చేశారు. దీంతో వృద్ధులు, దివ్యాంగులు పైకి వెళ్లేందుకు నానా అవస్థలు పడాల్సి వస్తుంది. మరోవైపు రిజిస్ట్రేషన్‌ కార్యాలయానికి వచ్చేవారు తమ కార్లు, ద్విచక్రవాహనాలను పార్కింగ్‌ చేసేందుకు సరిపడా స్థలం లేకపోవడంతో రోడ్డుపైనే పెట్టాల్సి వస్తోంది. దీనికితోడు రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే వారు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తుండడంతో కనీసం మూత్రశాలలు లేకపోవడంతో మహిళలు, వృద్ధులు చాలా అవస్థలు పడుతున్నారు. పాలకులు మారుతున్నా.. ప్రభుత్వాలు మారుతున్నా.. అధికారులు మారుతున్నా.. ఈ రెండు కార్యాలయ భవనాల తీరు మాత్రం మారడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నూతన భవనాలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



వసతులు లేని అద్దె భవనంలోని రిజిస్ట్రార్‌ కార్యాలయం

మన్మోహన్‌సింగ్‌కు ఘన నివాళులు



మేడ్చల్‌లో.. నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌రావు, హరివర్ధన్‌రెడ్డి తదితరులు



కీసరలో.. మన్మోహన్‌ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు



ఘనాపూర్‌లో.. నివాళులర్పిస్తున్న కాంగ్రెస్‌ నాయకులు



జవహర్‌నగర్‌లో.. నివాళులర్పిస్తున్న మేయర్‌ శాంతి తదితరులు

మేడ్చల్‌: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌ అకాల మరణం చెందడంతో మేడ్చల్‌లో కాంగ్రెస్‌ నాయకులు నివాళులర్పించారు. పట్టణంలోని అంబేద్కర్‌ విగ్రహం వద్ద మన్మోహన్‌సింగ్‌ చిత్రపటం ఏర్పాటు చేసి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. జిల్లా కాంగ్రెస్‌ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌రావు తదితర కాంగ్రెస్‌ నేతలు దివంగత ప్రధానికి నివాళులర్పించారు.

ఘట్‌కేసర్‌లో..

మున్సిపాలిటీలో కాంగ్రెస్‌ పార్టీ ఆధ్వర్యంలో భారత మాజీ ప్రధాని, ప్రపంచ ఆర్థిక వేత్త మనోహ్మన్‌సింగ్‌కు శుక్రవారం నివాళులర్పించారు. అంబేద్కర్‌చౌరస్తా, ఘనాపూర్‌, ఎదులాబాద్‌లో మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ పావనీజంగయ్య, బి-బ్లాక్‌ అధ్యక్షుడు మహేష్‌గౌడ్‌ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి మౌనం పాటించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ మున్సిపల్‌ అధ్యక్షప్రధాన కార్యదర్శి ముత్యాలు యాదవ్‌, రాధాకృష్ణ ముదిరాజ్‌, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు నాగరాజ్‌ముదిరాజ్‌, మాజీ సర్పంచులు మమతగౌడ్‌, రూప్‌సింగ్‌, మాజీ ఉప సర్పంచ్‌ పరమేష్‌గౌడ్‌, అనిత, ప్రభాకర్‌రెడ్డి, చిత్తారియాదవ్‌, రవీందర్‌, వెంకటేష్‌ ముదిరాజ్‌, సంజీవరెడ్డి, ఆంజనేయులు యాదవ్‌, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



ఘట్‌కేసర్‌లో.. నివాళులర్పిస్తున్న పావనీజంగయ్య తదితరులు

కీసరలో..

భారతదేశం అన్నీ రంగాల్లో పురోగతి చెందేందుకు కృషి చేసిన మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్‌ మృతి చెందడం ఎంతో బాధాకరమని కీసర మండల కాంగ్రెస్‌ కమిటీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ రామిడివిజయ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో మన్మోహన్‌సింగ్‌ మృతికి సంతాపంగా ఘనంగా నివాళులర్పించారు. ఈ మేరకు కీసర చౌరస్తాలో మన్మోహన్‌సింగ్‌ చిత్రపటానికి పూల మాలలు వేసి పలువురు కాంగ్రెస్‌ నేతలు నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ నేతలు తటాకం వెంకటేష్‌, రమేష్‌గుప్తా, దయానంద్‌గౌడ్‌, జూపల్లిరవీందర్‌, మల్లేష్‌, జంగయ్యయాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

జవహర్‌నగర్‌లో..

భారతదేశ మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ శుక్రవారం జవహర్‌నగర్‌ ప్రధాన చౌరస్తాలో ఆయన చిత్రపటానికి మేయర్‌ శాంతికోటేష్‌గౌడ్‌ పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌ మృతి దేశానికి తీరని లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్‌ రెడ్డిశెట్టి శ్రీనివాస్‌, కార్పొరేటర్లు గొడుగు వేణు, సాయి, శ్రీనివాస్‌, పానుగంటి బాబు, కో-ఆప్షన్‌ సభ్యురాలు శ్వేతాముఖేష్‌, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం రాలేదని..

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య



రేవంత్‌ (ఫైల్‌)

ఘట్‌కేసర్‌: ఉద్యోగం రాలేదని మనస్తాపానికిలోనైన ఓ యువకుడు రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. యాద్రాద్రి భువనగిరి జిల్లా, వెంకిర్యాల్‌ గ్రామానికి చెందిన రేవంత్‌ (25) డిగ్రీ పూర్తి చేశాడు. ఉద్యోగ ప్రయత్నాల్లో భాగంగా అమీర్‌పేట్‌లో కోచింగ్‌ తీసుకుంటున్నాడు. అయితే ఉద్యోగం కోసం చేస్తున్న ప్రయత్నాలు ఫలించకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన అతను శుక్రవారం అవుషాపూర్‌ సమీపంలో షిర్డీ ఎక్స్‌ప్రెస్‌ కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే సిబ్బంది సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.